www.vibharenews.com

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 29-10-2022 | సంపుటి : 04 | సంచిక : 62 | పేజీలు : 4 | వెల : రూ 3-00

## ఆరోగ్యశ్రీలోకి మరిన్ని వైద్య సేవలు.. 3,255 కు చేరిన సేవలు



తాడేపల్లి: వైద్య, ఆరోగ్యశాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో మంత్రి విడదల రజిని, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా, సమీక్ష సందర్భంగా ఆరోగ్య శ్రీ కింద వైద్య చికిత్సల సంఖ్యను 3,255కి పెంచుతూ సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా 809 వైద్య చికిత్సలను ఆరోగ్యశ్రీతో అందించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు.. ఆరోగ్య శ్రీ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాం. ఎక్కడా కూడా బకాయిలు లేకుండా చూస్తున్నాం. ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో నమ్మకం, విశ్వాసం కలిగింది. రోగులకు మరిన్ని వైద్య సేవలను ఇప్పుడు అందుబాటులోకి తీసుకు వస్తున్నాం. 104 కాల్ సెంటర్ ద్వారా ఆరోగ్యశ్రీ రిఫరల్ సర్వీసులు కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు.ఆరోగ్య శ్రీ కింద అందుతున్న సేవలపై ఎంపానల్డ్, విలేజ్ క్లినిక్స్, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో బోర్డులు ఉంచుతున్నామని అధికారులు స్పష్టం చేశారు. పూర్తి సమాచారంతో బుక్‌లెట్స్ కూడా ఇస్తున్నామన్నారు. ఆసుపత్రుల వివరాలు, అందుతున్న సర్వీసుల వివరాలు కూడా ఇందులో ఉంచుతున్నామని అధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తెలిపారు. కాగా, రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు గాయపడితే అలాంటి వారికి వెంటనే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందించాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రలకు సేవా మిత్రలు, సేవారత్న, ఉన్నత ఆరోగ్య సేవా అవార్డులు అందించనున్నట్టు తెలిపారు.ఆరోగ్యశ్రీలో వైద్య చికిత్సలు.. - మే 2019లో ఆరోగ్య శ్రీకింద వైద్య చికిత్సల సంఖ్య 1059 కాగా.. జనవరి 2020లో 2059కి పెంచుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైద్యం ఖర్చు వేయి రూపాయల ఖర్చుకు పైబడ్డ చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చారు. - జులై 2020లో 2200కు పెంచుతూ నిర్ణయం. ఈ సందర్భంగా అదనంగా చేర్చిన చికిత్సల్లో 54 క్యాన్సర్ చికిత్స ప్రొసీజర్లను చేర్చారు.- నవంబర్ 2020లో 2436 పెంపు. బోన్ మ్యారోతోపాటు 235 ప్రొసీజర్ల చేరిక.- మే-జూన్ 2021లో 2446కు ఆరోగ్యశ్రీ చికిత్సల పెంపు. 10 కోవిడ్ ప్రొసీజర్ల చేరిక.- 2022లో 3255కు పెంచుతూ సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఏమన్నారంటే...వైద్య ఆరోగ్య రంగంలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకు వచ్చాం: సీఎం.. భారీ సంఖ్యలో మునుపెన్నడూలేని విధంగా సుమారు 46వేల పోస్టులను భర్తీచేశాం.. ప్రభుత్వ రంగంలో మెరుగైన వైద్య సేవలు, నాణ్యమైన సేవలు అందాలన్నదే లక్ష్యం.. ఆరోగ్యవంతమైన సమాజంతో మంచి ఫలితాలు వస్తాయి

## నక్సలిజం ఏ రూపంలో ఉన్నా ఓడించాలి: మోదీ



న్యూఢిల్లీ,అక్టోబర్28 : ఏ రూపంలో ఉన్నా నక్సలిజాన్ని ఓడించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో రాష్ట్రాల హోం మంత్రులు, డీజీపీలతో శుక్రవారం నిర్వహించిన చింతన్ శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.' నక్సల్స్ గన్స్ పట్టుకోగలరు.. పెన్స్ పట్టుకోగలరు. వారు యువతను తప్పుదోవ పట్టిస్తారు' అని మోదీ వ్యాఖ్యానించారు. యువత భావోద్వేగాలను వాడుకొని దేశ సమైఖ్యతను దెబ్బతీయడానికి యత్నించేవారిని ఓడించేందుకు మన దళాలు మేధోశక్తిని పెంపొందచుకోవాలన్నారు. నక్సలిజం ఘటనలను డీల్ చేయడానికి రాష్ట్రాలు నిపుణులను పంపాలని ప్రధాని సూచించారు. చట్టాలు, రాజ్యాంగం గురించి మాట్లాడుతూ నక్సల్స్ అమాయకపు ముఖం పెడతరాని చెప్పారు. భద్రతా దళాలు అటువంటి శక్తులను గుర్తించాలన్నారు.బహుళ అంతస్తుల భవనాల్లో పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ సూచించారు. కింద అంతస్తులో పోలీస్ స్టేషన్ నిర్వహించి.. పై అంతస్తులో నివాస సముదాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అప్పుడే పోలీసులు నగరాలకు దూరంగా నివసించడం తగ్గుతుందన్నారు. ప్రభుత్వ తుక్కు విధానం ప్రకారం పాత వాహనాలను వినియోగించడానికి దూరంగా ఉండాలని మోదీ పోలీసులను కోరారు. దేశవ్యాప్తంగా పోలీసులకు ఒకేరకమైన యూనిఫాం ఉండాలన్నారు. రాష్ట్రాలు ఈ విషయంపై జాగ్రత్తగా ఆలోచించాలని అభ్యర్థించారు. దేశవ్యాప్తంగా పోస్టుబాక్స్‌ను ఎలా గుర్తుపట్టగలమో.. పోలీస్ యూనిఫాంను కూడా అలానే గుర్తించగలిగేలా ఉండాలన్నారు. సోషల్ మీడియాను ఎట్టి పరిస్థితుల్లో తక్కువ అంచనా వేయవద్దని ఆయన సూచించారు. అది తప్పుడు వార్తలతో గందరగోళం సృష్టించగలదన్నారు. రిజర్వేషన్ల అంశంలోనే ఇలాంటి పరిస్థితే చోటుచేసుకొని హింసకు దారి తీసిందని ప్రధాని గుర్తు చేశారు. ఏదైనా సమాచారాన్ని ఫార్వర్డ్ చేసే ముందు పదిసార్లు సరిచూసుకోవాలన్నారు.

## ఈనాడు పత్రికకు చంద్రబాబు పిచ్చి పట్టుకుంది: మంత్రి పెద్దిరెడ్డి



విజయవాడ: ఈనాడు పత్రికకు చంద్రబాబు పిచ్చి పట్టుకుంది. విశాఖ రాజధానిగా ఇష్టం లేకపోవడం వల్లే కొన్ని పత్రికలు తప్పుడు వార్తలు రాస్తున్నాయి అని మంత్రి పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.కాగా, మంత్రి పెద్దిరెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మూడు ప్రాంతాల అభివృద్ధే మా పార్టీ విధానం. ఈనాడు పత్రికకు చంద్రబాబు పిచ్చి పట్టుకుంది. రూ.లక్షల కోట్ల కబ్జా గతంలో రాసింది మీరే కదా?. సిట్ వేసింది కూడా చంద్రబాబు హయంలోనే కదా?.మీ రాతలతో చంద్రబాబు తలరాత మార్చడం సాధ్యం కాదు. కుక్కతోక వంకర మాదిరిగానే మీ బుద్ధి ఎప్పటికీ మారదు. విశాఖలో అక్రమాలకు పాల్పడిన అధికారులపైన మేము చర్యలు తీసుకున్నాం. చంద్రబాబుకు రాజకీయంగా నడిచే సామర్థ్యం లేదు. టీడీపీ నాయకులు రిషికొండ దగ్గరకు వెళ్తే ఉత్తరాంధ్రను రక్షించినట్లు అవుతుందా?. పాదయాత్రను ఎందుకు మధ్యలోనే నిలిపివేశారో వారికే తెలియదు అంటూ కామెంట్స్ చేశారు.

## బీసీల కోసం ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయండి



బీసీలను సీఎం జగన్ ఉద్ధరించారనడం.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్న పాత్రుడు విమర్శించారు. 981 నామినేటెడ్ పదవుల్లో 742 పోస్టులు రెడ్డీలకు ఇచ్చి బీసీలకు అన్యాయం చేశారని ఆరోపించారు.బీసీలను సీఎం జగన్ ఉద్ధరించారనడం.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్న పాత్రుడు విమర్శించారు. 981 నామినేటెడ్ పదవుల్లో 742 పోస్టులు రెడ్డీలకు ఇచ్చి బీసీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఎంపీ విజయసాయిరెడ్డి విశాఖలో రూ.45 వేల కోట్ల ఆస్తులను దోచేస్తే పోలీసులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ 56 కార్పొరేషన్లు పెట్టి రిక్తహస్తం చూపించిందని, అసలు జగన్ ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని అయ్యన్న పాత్రుడు డిమాండ్ చేశారు.

## గిరిజనుల భూమిని ఆక్రమించారంటూ ఏపీ హైకోర్టులో పిల్ దాఖలైంది.

అమరావతి: గిరిజనుల భూమిని ఆక్రమించారంటూ ఏపీ హైకోర్టు లో పిల్ దాఖలైంది. అల్లూరి జిల్లా లో 15 ఎకరాల 23 సెంట్ల భూమి ఆక్రమించారని ఎటపాక మండలం గౌరీదేవిపేట సర్పంచ్ శివ కనకరాజ్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. గిరిజనుల చట్టాలను ఉల్లంగించి గిరిజనేతరులు ప్రభుత్వ భూమిని ఆక్రమించటం చట్టరీత్యా నేరమని న్యాయవాది వాదించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నారని జడ శ్రవణ్ కుమార్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తక్షణమే కట్టడాలు నిలిపివేయాలంటూ హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు... తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.



## ఫ్యాకల్టీ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.. తాడేపల్లిగూడెం నిట్‌లో విద్యార్థుల ఆందోళన

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో విద్యార్థులు ఆందోళనకు దిగారు.బయోటెక్నాలజీ విభాగానికి చెందిన ఫ్యాకల్టీ అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని విద్యార్థులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో నిట్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం వద్ద విద్యార్థులు బైఠాయించారు. అతడిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా హెచ్‌ఓడీ పట్టించుకోవడం లేదని.. అందుకే తరగతులను బహిష్కరించి ఆందోళనకు దిగినట్లు చెప్పారు. అతడితో బహిరంగ క్షమాపణ చెప్పించి విధుల నుంచి తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనతో నిట్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. మరోవైపు నిట్ ప్రాంగణంలోకి ఇతరులు ఎవరూ ప్రవేశించకుండా సెక్యూరిటీ అడ్డుకోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది.



## రూ.100కోట్లతో ఎమ్మెల్యేలను కొనాల్సిన ఖర్మ మాకేంటి?: కిషన్‌రెడ్డి

దిల్లీ: తెలంగాణలో భాజపా వస్తుందనే భయంతోనే తెరాస కట్టుకథలు చెబుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'తెరాస ఎమ్మెల్యేలకు ఎర' కేసుపై దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు.పార్టీలో చేరిన వారితో రాజీనామాలు చేయించకుండా మంత్రి పదవులు ఇచ్చి వారిని కొనసాగించిన చరిత్ర సీఎం కేసీఆర్‌దేనని విమర్శించారు. ఆయన ఫిరాయింపుల గ్రేట్ మాస్టర్ అని ఎద్దేవా చేశారు."ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ముందు రూ. 100 కోట్లు అన్నారు.. ఇప్పుడు రూ. 15 కోట్లు అంటున్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించేది కేసీఆరే. భాజపాలో చేరడం అంటే రాజ్యాంగ విరుద్ధమైనట్లు ప్రచారం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై వచ్చిన వారిని సమర్థించడం లేదు.. వాళ్లు ఎవరో కూడా తెలియదు. ఈటల రాజేందర్ నేతృత్వంలో భాజపా చేరికల కమిటీని నియమించుకుంది. పార్టీలో ఎవరైనా చేరాలంటే తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాతే నేర్చుకోవాలనే నైతిక నియమం పెట్టుకున్నాం. మీ నుంచి నీతులు నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు.మాయమాటలతో డ్రామా సృష్టించి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. నలుగురు ఎమ్మెల్యేలు మాకు అవసరం లేదు. ఆ నలుగురు ఎమ్మెల్యేలు ఇప్పటికప్పుడు భాజపాలోకి వస్తే ఏంటి? రాకపోతే ఏంటి? వారి వల్ల కేసీఆర్ ప్రభుత్వానికి నష్టం జరుగుతుందా? భాజపా ప్రభుత్వం ఏర్పడుతుందా? రూ. 100 కోట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను కొనాల్సిన ఖర్మ మాకు పట్టలేదు. ఇది పూర్తిగా కల్పితంతో చేసిన ఘటన. కల్వకుంట్ల కుటుంబంపైనే ముందు కేసులు పెట్టి జైలుకు పంపాలి. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో లేదా సీబీఐతో విచారణ జరిపించాల్సిందే. మునుగోడు ఎన్నికకు ముందు ఏదో ఒక డ్రామా చేసి గెలవాలని ప్రయత్నం చేస్తున్నారు" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.



## వచ్చేనెల రుషి సునాక్‌తో భేటీకానున్న మోదీ..!

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, భారత ప్రధాని నరేంద్ర మోదీ భేటీకి రంగం సిద్ధమైంది. వీరిద్దరూ త్వరలోనే ఇండోనేషియాలోని బాలి నగరంలో జరగనున్న జీ-20 సమావేశం సందర్భంగా భేటీకావాలని నిశ్చయించుకొన్నారు. బ్రిటన్ ప్రధాని కార్యాలయమైన 10-డౌనింగ్ స్ట్రీట్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం "ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసేందుకు రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలుగా కృషి చేయాలని ఇరువురు నాయకులు అంగీకరించారు. త్వరలోనే బాలిలో జరగనున్న జీ20 సమావేశాల సందర్భంగా భేటీకావాలని వీరు నిర్ణయించారు" అని పేర్కొంది.బ్రిటన్ ప్రధానిగా ఎంపికైన రిషి సునాక్‌కు భారత ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సునాక్‌కు వ్యక్తిగతంగా ఫోన్ చేసి మాట్లాడిన ప్రపంచ స్థాయి నేతల్లో మోదీ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా ముగించాల్సిన ఆవశ్యకతను మోదీ వివరించారు. యూకే ప్రధాని కార్యాలయం దీనిపై ప్రకటన విడుదల చేసింది. "ప్రపంచంలో ఎదురువుతున్న సవాళ్లపై అభిప్రాయాలు పంచుకొన్నారు. పర్యావరణ మార్పులపై మోదీ నాయకత్వంలో చేస్తున్న కృషిని ప్రధాని సునాక్ అభినందించారు. ఆర్థిక, రక్షణ, భద్రతా పరమైన భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఉన్న అవకాశాలను స్వాగతించారు" అని ఆ ప్రకటనలో పేర్కొంది.



# సంపాదకీయం

శనివారం 29-10-2022

## తెలుగు విద్యార్థులకు ఐఐటీ స్ట్రెస్

అత్యంత కఠినమైన జేఈఈ ప్రవేశ పరీక్షలో ర్యాంక్ కొట్టి, ఐఐటీల్లో ప్రవేశం పొందడం అనేది తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది విద్యార్థుల కల. ఐతే ఈ కల సాకారానికి విద్యార్థులు భారీ మూల్యం చెల్లించవల్సి వస్తోంది. నివేదికల ప్రకారం 2014 నుంచి 2022 అక్టోబర్ మధ్య కాలంలో దేశంలోని వివిధ ఐఐటీల్లో చదువుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన విద్యార్థులు దాదాపు 15 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాజాగా ఐఐటీ గువహతిలో చదువుతున్న బీటెక్ విద్యార్థి జీ మహేష్ సాయి రాజ్ అక్టోబర్ 10న ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అకడమిక్ పర్ఫామెన్స్ సరిగ్గాలేదనే మనస్థాపంతో విద్యార్థి మృతి చెందాడు. నిజానికి ఐఐటీల్లో విద్యార్థుల జీవితం ఏ విధంగా ఉంటుంది? వారిలో కొరవడుతున్న స్కిల్స్ ఏమిటి? విద్యావేత్తలు ఏమంటున్నారు? వంటి విషయాలు పరిశీలిస్తే..2014 నుంచి ఐఐటీల్లో చదుతువున్న 34 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు డిసెంబర్ 2021లో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంటులో వెల్లడించారు. ఐఐటీల్లో ఈ వరుస ఆత్మహత్యలపై సర్వత్రా కలత చెందుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధానంగా మూడు కారణాలు ఉన్నట్లు పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తలు చెబుతున్నారు. సాధారణంగా తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థుల్లో కొంతమంది విద్యార్థులు భాషా పరమైన అవరోధాలు ఎదుర్కొంటుంటారు.నార్త్ ఇండియా నుంచి వచ్చే వారితో పోల్చితే దక్షిణ భారత దేశం నుంచి వచ్చే విద్యార్థులపై వివక్ష చూపడం/ పక్షపాత ధోరణి కనిపిస్తోంది.హైదరాబాద్‌లోని కొన్ని కోచింగ్ సెంటర్‌ల నుంచి వచ్చే విద్యార్థులు మాత్రమే జేఈఈలో ర్యాంక్ సాధిస్తారని, వీరికి ఐఐటీలో చేరేంత లైఫ్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ లేదనేది ఈ రెండు తెలుగు రాష్ట్రాలకు వెలుపల ఉండే అత్యధికులు భావిస్తుంటారు.ప్రత్యేకమైన కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో స్టడీ మెటీరియల్స్‌తో కుస్తీపట్టి, ప్రాక్టీస్ సెషన్‌ల ద్వారా జేఈఈలో ర్యాంక్‌లు సాధిస్తారని, సొంతంగా చదివే తెలివితేటలు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉండవని ఐఐటీల్లో ఉండే టీచర్లు, ఇతర విద్యార్థులు బలంగా నమ్ముతారు అని ఐఐటీ–ఇండోర్‌లో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న ఓ తెలుగు విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు.నిర్దిష్ట కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి వచ్చే విద్యార్థుల చదువు ఏ విధంగా ఉంటుందనే విషయంపై ప్రొఫెసర్లు సైతం వ్యంగ్యాస్త్రాలు సంధిస్తుంటారు. ఐఐటీ ప్రిపరేషన్‌లో కోచింగ్ ఒక ప్రధాన భాగం. కోచింగ్ లేకుండా వచ్చేవారిని మైనారిటీలుగా పరిగణిస్తారు. తెలుగు విద్యార్థులపై ఈ విధమైన వివక్ష ధోరణి బ్లాక్ మార్క్‌లా పడిపోయింది. తెలుగు/హిందీ/తమిళం ఏ భాషలోనైనా స్థానిక విద్యా నేపథ్యం ఉన్న విద్యార్థులు ఈ విధంగా ఐఐటీల్లో పరభవానికి గురువుతన్నారు. కోచింగ్ సెంటర్లలో టీచర్లు మాతృభాషను ఇంగ్లిష్ భాషతో మిక్స్ చేసి బోధిస్తారు. ఐఐటీల్లో కమ్యూనికేషన్ దాదాపు ఇంగ్లీష్‌లోనే ఉంటుంది. అందువల్ల భాషాపరమైన అవరోధం ఐఐటీల్లో అధికంగా ఎదురవుతుంది. కోచింగ్ నుంచి నేరుగా ఐఐటీలకు ఎడ్యుకేషన్ మోడల్‌కు అకస్మాత్తుగా మారడంతో ప్రస్తుతం ఈ సమస్య యూనివర్సల్ ప్లాబ్లెంగా పరిణమిందని' ఐఐటీ బాంబేలోని సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అసోసియేట్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ అనురాగ్ మెహ్రా వివరించారు.చాలా మంది తెలుగు విద్యార్థులు హిందీ మాట్లాడే వారితో కమ్యునికేట్ చేయడంలో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వీరిలో సాఫ్ట్ స్కిల్స్ కూడా చాలా తక్కువగా ఉంటాయి. ఎందుకంటే కోచింగ్ సెంటర్‌లు అకడమిక్స్‌పై ఎక్కువ దృష్టి పెడతాయి. ఇతర విషయాలను దాదాపుగా విస్మరిస్తాయి. దీంతో విద్యార్థులు ఇతరులతో కమ్యూనికేట్ చేయలేని పరిస్థితిలో పడిపోతున్నారు. కమ్యునికేషన్ స్కిల్స్ అభివృద్ధి మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది' అని ఖరగ్‌పూర్‌కు చెందిన ఓ ప్రొఫెసర్ అన్నారు.క్యాంపస్ జీవితం ఇండివిడ్యువల్‌గా ఉంటుంది. దీంతో ఓంటరిగా ఫీల్ అయ్యే విద్యార్థులు తోటి ఫ్రెండ్స్‌లో ఓదార్పును కోరుకోవడం ప్రారంభిస్తే.. అటువంటి వారికి సరైన మద్ధతు దొరకదు. ఐఐటీల్లో చదివే స్టూడెంట్స్‌లో స్ట్రెస్ చాలా ఎక్కువగా ఉంటుంది. పోటీతత్వం ఎక్కువ. ప్రతి స్టూడెంట్ తన పోరాటం చేస్తుంటాడు. మధ్యలో ఒకరు జారి పడిపోతే, ఎవరూ పట్టించుకోరు. గమ్యం చేరేంత వరకు ఎవరి పరుగు వారు పరిగెత్తాల్సిందే' అని ఓ విద్యార్థి తెలిపాడు.'నా ఎంటెక్ చదువుతున్నప్పుడు, నేను డిప్రెషన్‌లో ఉన్నాను. ఏకాగ్రతతో చదివేందుకు చాలా కష్టపడ్డాను. ప్రొఫెసర్ ఉదయం 5 గంటలకు మెసేజ్ చేస్తాడు. ఒక వేళ ఆ మెసేజ్ చూడకపోతే.. ఉదయం 7 గంటలకు తన క్యాబిన్‌కు పిలిపించుకుని, నా పర్ఫామెన్స్‌పై చివాట్లు వేస్తారని' ఐఐటీ బాంబేలో చదివే ఓ విద్యార్థి తెలిపాడు.సాధారణంగా ఐఐటీ క్యాంపస్‌లు సిటీలకు దూరంగా ఉంటాయి. చదువు ఒత్తిడి, ప్రొఫెసర్ల కఠిన వైఖరి అనేది కేవలం తెలుగు విద్యార్థులకే పరిమితం కానప్పటికీ.. ఇతర సమస్యలు కూడా వీరిలో మరింత స్ట్రెస్ పెరిగేందుకు దోహదపడుతున్నాయి. ముఖ్యంగా వివక్షపూరితమైన వైఖరి మన విద్యార్థులను ఆత్మహత్యలవైపు నడిపిస్తున్నాయి.

## పొత్తులపై తేల్చనున్న జనసేన

విజయవాడ, అక్టోబరు 28, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటి (పీఏసీ) సమావేశం కు డేట్ ఫిక్స్ అయ్యింది..ఈనెల 30వ తేదీన సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తో పాటుగా పార్టీ అగ్రనేతలు నాదెండ్ల మనోహర్,నాగబాబు ఇతరనాయకులు సమావేశంలో పాల్గొంటారు. ఇటీవల విశాఖ ఎయిర్ పోర్ట్ ఘటన తరువాత పరిణామాలను గురించి పార్టీలో అంతర్గతంగా చర్చించి భవిష్యత్ కార్యచరణను రెడీ చేస్తామని పార్టీ వర్గాలు ప్రకటించాయి.రెండు రోజుల పాటు పవన్ పార్టీ కార్యాలయంలో నే రాజకీయ వ్యవహారాలను గురించి చర్చిస్తారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.విశాఖపట్టణం ఎయిర్ పోర్ట్ ఘటన పై కీలకంగా చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఘటన జరిగిన తరువాత చోటు చేసుకున్న పరిణామాలు గురించి లోతుగా చర్చించటంతో పాటుగా భవిష్యత్ కార్యచరణను రెడీ చేసేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు ప్రకటించాయి. విశాఖ ఎయిర్ పోర్ట్ ఘటన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న పరిస్దితులు,రాజకీయంగా ఈ అంశంలో కలసి వచ్చిన అంశాలతో పాటుగా అదికార పక్షాన్ని ఢీ కొట్టేందుకు అవసరం అయిన మిగిలిన అస్త్రాలను ఎలా రెడీ చేయాలి.. ఇందుకు అవసరం అయిన చర్యలు తీసుకునే విషయాలు గురించి పవన్ కీలకంగా చర్చిస్తారు. ఇదే సమయంలో పవన్ ను ఉద్దేశించి వైసీపీ నేతలు,మంత్రులు చేసిన వ్యాఖ్యల పై కూడ చర్చించాలని నాయకులు భావిస్తున్నారు.విశాఖ ఘటన పై న్యాయ పరంగా కూడ ముందుకు వెళ్ళాలని పవన్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు.దీని పై కూడ పార్టీ నేతలతో చర్చించే అవకాశం ఉందని నాయకులు చెబుతున్నారు. పవన్ కల్యాణ్‌పై వైఎస్ఆర్‌సీపీ నేతలు పూర్తిగా వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం ఇస్తున్నారని జనసేన వర్గాలు అంటున్నాయి. పవన్ వ్యక్తిగత జీవితాన్ని ప్రస్తావిస్తూ.. మూడు పెళ్లిళ్ల అంశంపై ప్రతీ రోజూ ఏదో ఓ కామెంట్ చేస్తున్నారు. అదే సమయంలో ఈ అంశంపై మహిళా కమిషన్ కూడా నోటీసులు ఇచ్చింది. వీటిపైనా చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే జనసేనాని పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేయాలని కూడ నిర్ణయించారు.అయితే ఇప్పటికే పలు దఫాలుగా ఈ నిర్ణయం వాయిదా పడుతూ వస్తుంది.సంక్రాంతి తరువాత బస్సు యాత్ర చేయాలని కూడ పవన్ నిర్ణయంచారు.ఇందుకు సంబందించిన అంశాల పై కూడ రాజకీయ వ్యవహారాల కమిటి సమావేశంలో చర్చించనున్నారు. బస్సు యాత్ర ఎంత కాలం చేయాలి.. ఎలా చేయాలి... ఏపి నియోజకవర్గాల గుండా వెళ్లాలన్నదానిపై రూట్ మ్యాప్ ఖరారు చేయనున్నారు. అలాగే ఇటీవల పవన్ కల్యాణ్.. చంద్రబాబు మధ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను పవన్.. పీఏసీ ముందు ఉంచే అవకాశం ఉంది. భవిష్యత్ వ్యూహంపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## అంతుచిక్కని వింత వ్యాధి

కాకినాడ, అక్టోబరు 28, అది ఒక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. కాని అక్కడ ఒక అంతు చిక్కని వింత సమస్యతో ఆ విద్యార్థినులు బాధపడుతున్నారు. ఉన్నంటుండి ఊపిరాడక ఇబ్బంది పడుతూ.. స్పృహ తప్పి పడిపోతున్నారు. ఆ విద్యార్థినులు ఎందుకిలా పడిపోతున్నారు అనేది డాక్టర్లకు సైతం అంతు చిక్కని వింత ప్రశ్నగా మిగిలిపోయింది. గతంలో కాకినాడ కేంద్రియ విద్యాలయంలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. అసలు ఎందుకు ఇలా జరుగుతుంది..? కారణాలు ఏంటి..?కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాదాపుగా 1500 పైగా విద్యార్థులు. అందులో సగానికి పైగా బాలికలు ఉండడంతో రెండు సెక్షన్లుగా విభజించి బాలురిని, బాలికలను సపరేట్ చేశారు. స్కూల్లో పరిసరాలన్నీ బాగానే ఉన్నప్పటికీ గత మూడు నెలలుగా అప్పుడప్పుడు ఇద్దరు ముగ్గురు విద్యార్థులు ఊపిరాడక పడిపోతు ఉంటున్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లి చికిత్స చేయించి పరిస్థితి నార్మల్ గా ఉండటంతో వెంటనే రికవరీ అవి ఇంటికి వస్తున్నారు. కానీ గత ఐదు రోజుల క్రితం ఊపిరాడక, స్పృహ తప్పి 9,10వ తరగతి చెందిన ఆరుగురు విద్యార్థానులకు ఇదే సమస్య పునరావతం కావడంతో ఉపాధ్యాయులు మళ్లీ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి గుట్టు చప్పుడు కాకుండా మళ్ళీ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స చేయించారు. దీంతో విద్య, వైద్యాధికారులు స్పందించి అస్వస్థతకు గురైన విద్యార్థినులను స్థానిక యు.కొత్తపల్లి పి హెచ్ సి కి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అదే సమయంలో మళ్లీ సమస్య పునరావృత్తమై.. ఊపిరాడక విలువలాడుతుండడంతో 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఏడుగురు విద్యార్థులను తరలించారు.అయితే వీరు ఉదయం వరకు ఊపిరాడక విలువలు ఆడుతున్న విద్యార్థులు మధ్యాహ్నం వరకు అసలు ఏమి జరిగిందో వైద్యులకు సైతం అంతుచిక్కలేదు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ఎన్ని పరిక్షలు చేసిన అన్ని నార్మల్ గా ఉంది. మధ్యాహ్నం వరకు ఒక లెక్కా.. మధ్యాహ్నం తర్వాత మరో లెక్కగా పరిస్థితి పూర్తి భిన్నంగా మారిపోయింది. మధ్యాహ్నం రోగులుగా వెళ్ళినవారు సాయంత్రం నవ్వులు పువ్వులు విరజిల్లితూ కనిపించారు విద్యార్థులు. అసలు ఏం జరిగింది వీళ్ళకి నిజంగానే అస్వస్థకు గురై ఊపిరాడక ఇబ్బంది పడ్డారా.. లేక వీరు సైకలాజికల్ గా ఒక భ్రమలో ఈ విధంగా ప్రవర్తించారనేది డాక్టర్లు సైతం అంతుచిక్కలేదు.స్థానికులు అయితే 1997లో పూర్వ విద్యార్థులు ఇదే స్కూల్ లో ఇదేవిధంగా వ్యవహరించే వారని దెయ్యం , భూతం వంటివి ఏమైనా వీళ్ళకి ఆవరించి ఉంటాయని పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆ స్కూల్లో ఏం జరుగుతుంది.. విద్యార్థులు ఎందుకలా ప్రవర్తిస్తున్నారు అనేది ప్రశ్నార్థకంగా మారటంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై జిల్లా వైద్యాధికారులు స్కూల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్కూల్ లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు ప్రత్యేక డాక్టర్లు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినా ఏటువంటి పురోగతి కనిపించలేదు. ఈ పరీక్షల్లో కొందరికి రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కానీ శ్వాస ఆడక ఇబ్బంది పడడం అనేది అంతుచిక్కడం లేదు. వైద్యులు పరీక్షలు నిర్వహిస్తుండగా మరో ఇద్దరు విద్యార్థులు అదే పరిస్థితి పునరావృతంమై ఊపిరాడక ఇబ్బంది పడడంతో యు.కొత్తపల్లి పీహెచ్సీ సెంటర్ కి తరలించారు. ఈ విధంగా జరిగిన విద్యార్థులకు ఎన్ని వైద్య పరీక్షలు చేసిన రికవరీ కావడం లేదు కానీ.. పేపర్ , కవర్ నోటికి, ముక్కుకి పెట్టి ఉంచితే ఊపిరావడక ఇబ్బంది పడిన విద్యార్థులు వెంటనే కోలుకుంటున్నారు. దీంతో ఇది ఏ విధమైన వైద్యమో ఎవరికీ అర్థం కావడం లేదు.స్కూల్ ఆవరణంలోనూ, క్లాస్ రూమ్ లోనూ ఆక్సిజన్ శాతం తక్కువ ఉండడం వలన ఈ విధంగా జరుగుతుందా.. విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడం వలన ఈ విధంగా జరుగుతుందా.. లేక దెయ్యం భూతం వంటి మానసిక భయానికి విద్యార్థులు గురవుతున్నారా అనేది తెలియ రావడం లేదు. మరో పక్క స్కూల్ టీచర్స్ మాత్రం పొంతనలేని సమాధానం చెప్పడం పలు అనుమానాలు కలిగిస్తుంది. స్థానిక పాఠశాల మెంబర్.. కొంతమంది స్తానికులు ఇది కావాలనే విద్యార్థులతో ఇలా చేయించారని .. కుట్ర జరుగుతోంది అని ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనల వెనుక నిజమెంటో అన్న అనుమానాలు కలుగుతున్నాయి.రెండు నెలల క్రితం కాకినాడలో కేంద్రీయ విద్యాలయంలో ఇటువంటి ఘటన జరగడం..మళ్ళీ ఈ స్కూల్ లో ఘటన రెండు సమస్యలు ఒకేలా ఉండడంతో దీనిపైన పెద్దగా స్పష్టత రాలేదు. ఈ రెండు సంఘటనలపై సంబంధిత ప్రభుత్వ అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిజానిజాలను తీలుసుకోవాలి. ప్రాణ నష్టం లేనప్పటికీ విద్యార్థులు ఈ విధంగా ఎందుకు గురవుతున్నారో తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## దువ్వాడకే టిక్కెట్...

శ్రీకాకుళం, అక్టోబరు 28, పీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్‌ను జగన్ ఖరారు చేశారు. అక్కడ మూడు, నాలుగు వర్గాలు ఉండటంతో చివరి క్షణంలో టిక్కెట్ ఖరారు చేస్తే సమస్య అని.. ముందుగానే అందర్నీ పిలిచి దువ్వాడకు టిక్కెట్ ఖరారు చేసి రేసులో ఉన్న ఇతర నేతలకు పార్టీ కోసం పని చేయాలని స్పష్టం చేశారు. అలా చేస్తేనే పదవులు ఉంటాయన్నారు. ప్రశాంత్ కిషోర్ టీం ఎంపిక చేసిన 71 మంది టెక్కలి వైఎస్ఆర్‌సీపీ ప్రజాప్రతినిధులతో జగన్ క్యాంప్ ఆఫీసులో సమావేశమయ్యారు. వీరిలో అత్యధికులు వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్‌కు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. 'మా మండలంలో 19 మంది సర్పంచ్లు, 11మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎవ్వరం ఆయన గడప ఎక్కడంలేదు. ఎందుకంటే.. ఇంతకు ముందు వెళ్లి అవమానపడ్డాం. ఆయనకు టిక్కెటిస్తే చేయలేం.' – ఇది కోటబొమ్మాళి ఎంపీపీ రోణంకి మల్లయ్య నేరుగానే ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సీఎం జగన్ మాత్రం వారి అభిప్రాయాలను పట్టించుకోలేదు. దువ్వాడకే టిక్కెట్ ఖరారు చేశామని గెలిపించి తీరాలని ఆదేశించారు. మెజార్టీ క్యాడర్ వ్యతిరేకించినా దువ్వాడనే అభ్యర్థిగా జగన్ ప్రకటించడంతో జగన్ ఆయనపై నమ్మకం పెట్టుకున్నారని.. తాము ఆ మాత్రం నమ్మకం పొందలేకపోయామని నిరాశపడ్డారు. టెక్కలి నుంచి గతంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయారు దువ్వాడ శ్రీనివాస్. గత ఎన్నికల్లో పేరాడ తిలక్ పోటీ చేసి ఓడిపోయారు. ఈ సారి కూడా తనకే చాన్సివ్వాలని ఆయన అడుగుతున్నారు. కానీ ఆయనకు కార్పొరేషన్ పదవి ఇచ్చి 2024లో దువ్వాడ శ్రీను టెక్కలి నుంచి పోటీ చేస్తారని, ఆయన్ను గెలిపించుకు తీసుకురావాలని అప్పుడే ఎమ్మెల్సీ ఇస్తానని తిలక్‌కు తేల్చి చెప్పారు. అయితే దువ్వాడ శ్రీను వ్యవహారశైలి వల్ల క్యాడర్ ఆయనకు దూరంగా ఉంటోంది. విపక్షాలను ముఖ్యంగా అచ్చెన్నాయుడును అసభ్యంగా తిడుతూ ఉంటారు. అదే స్థాయిలో తనకు అనుకూలంగా లేరని సొంత పార్టీ నేతలనూ మాటలనేస్తూ ఉంటారు. దీంతో ఆయనకు చాలా మంది దూరమయ్యారు. దువ్వాడ ఎన్ని మాటలన్నా... అచ్చెన్నాయుడు మాత్రం ఆయనను ఏమీ అనరు. అచ్చెన్న ఏమీ అనకపోయినా ఇష్టం వచ్చినట్లుగా దువ్వాడ తిడుతూండటంతో అచ్చెన్నకు సానుభూతి పెరుగుతోందన్న వాదన వినపిస్తోంది. అదే సమయంలో జనసేన పార్టీ కార్యాలయంపై దాడి చేయడం కూడా కొన్ని వర్గాల్లో ఆయనపై వ్యతిరేకత మరింత పెరగడానికి కారణం అయింది. నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలా ల్లోనూ తన ప్రత్యర్థి వర్గానికి చెందిన నేతలున్నారని భావించకుండా ఎవరైనా వైకాపావారేనన్న భావనతో దువ్వాడ శ్రీను ముందుకెళితే ఫలితం ఉంటుందని వైసీపీ అభిమానులు అంటున్నారు. సమీక్షలో కృపారాణి, పేరాడ తిలక్లు మౌనంగానే ఉన్నారు. తిలక్‌కు సంబం ధించి సమీక్షలో అనేక మార్లు ఎమ్మెల్సీ చేస్తానని, గెలిపించుకురావాలని చెప్పినప్పటికీ కృపారాణికి ఎటువంటి హామీ ఇవ్వలేదు. ఆమెకు ఎంపీ టిక్కెట్ ఇస్తారని భావిస్తున్నారు.



## జగన్ సెంట్రిక్ గా రెండు సినిమాలు

విజయవాడ, అక్టోబరు 28, సీఎం జగన్‌తో భేటీ తర్వాత జగన్ తాను ఎలాంటి సినిమా తీయనున్నారో వెంటనే ప్రకటించారు. తన కొత్త సినిమాకు "వ్యూహం" అని పేరు పెట్టారు. తాను తీయబోయేది బయోపిక్ కాదు ?బయో పిక్ కన్నా లోతైన రియల్ పిక్ అని ఆర్జీవీ ప్రకటించారు. బయో పిక్ లో అయినా అబద్దాలు ఉండొచ్చు కానీ ,రియల్ పిక్ లో నూటికి నూరు పాళ్ళు నిజాలే ఉంటాయని ప్రకటించారు. అహంకారానికి , ఆశయానికి మధ్య జరిగిన పోరాటం నుండి "వ్యూహం" కథ వచ్చిందన్నారు. రాజకీయ కుట్రల విషం తో నిండి వుంటుంది .రాచకురుపు పైన వేసిన కారం తో బొబ్బలెక్కిన ఆగ్రహానికి ప్రతికాష్టే "వ్యూహం" చిత్రం అని ఆర్జీవీ ప్రకటించారు. సినిమాకు నిర్మాతగా దాసరి కిరణ్ ఉంటారని ఆర్జీవీ ప్రకటించారు. అయితే ఈ రియల్ పిక్ ఒక సినిమా కాదని రెండు సినిమాలని చెబుతున్నారు. వ్యూహం .., తర్వాత శపథం అని రెండు సినిమాలు ఉంటాయన్నారు. ప్రేక్షకులకు షాక్ ఇస్తామన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్‌తో భేటీ అయ్యేందుకు తాడేపల్లిలో ఆర్జీవీ వచ్చారు. అయితే ఆయన నేరుగా ప్రధాన ద్వారం గుండా రాకుండా రహస్యంగా వెనుక ద్వారా గుండా వచ్చి.. జగన్‌తో నలభై నిమిషాల పాటు లంచ్ భేటీ నిర్వహించి మళ్లీ అదే ద్వారం గుండా వెళ్లిపోయారు. విజయవాడలో హోటల్, ఎయిర్ పోర్టు వద్ద మీడియాతో మాట్లాడలేదు. జగన్‌తో మీటింగ్ జరిగిన ఒక్క రోజులోనే తాను రాజకీయ చిత్రం చేస్తున్నట్లుగా ప్రకటించారు. దాని పేరు కూడా ప్రకటించడంతో స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయి ఉంటుందని భావిస్తున్నారు. సీఎం జగన్‌తో ఆర్జీవీ భేటీ అయిన వెంటనే.. ఆయన నిర్మాణ సంస్థలో మూడు సినిమాలు రూపుదిద్దుకుంటాయన్న ప్రచారం జరిగింది. రెండు సినిమాలు పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఇతరులతో తీయిస్తారని.. జగన్ బయోపిక్‌ను మాత్రం ఆయన స్వయంగా దర్శకత్వం చేస్తారని.. జగన్ కు ఎలివేషన్లు ఇచ్చేలా ఈ సినిమ ఉంటుందన్న అభిప్రాయం వినిపించింది. ఇప్పుడు ఆర్జీవీ కూడా అదే పద్దతిలో ట్వీట్ చేశారు. బయోపిక్ కాదు రియల్ పిక్ అని చెప్పడం ద్వారా జగన్మోహన్ రెడ్డి జీవితాన్ని తెరకెక్కిస్తున్నట్లుగా చెప్పకనే చెప్పినట్లయింది. ఈ సినిమా వచ్చే ఎన్నికల ముందు రిలీజ్ చేసే అవకాశం ఉంది. స్వయంగా వైఎస్ఆర్‌సీపీ అధినేత , సీఎం జగన్ ఆసక్తితో నిర్మిస్తున్నారు కాబట్టి బడ్జెట్ సమస్య రాదని.. ఖచ్చితంగా రిలీజ్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఆర్జీవీ ఇటీవల వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు కొండా దంపతుల జీవిత కథ కొండాను తెరకెక్కించారు. ఆ సినిమా కనీస ఇంపాక్ట్ చూపించలేకపోయింది. థియేటర్లలో విడుదల చేసుకోలేకపోయారు. విడుదలైందో లేదో కూడా ఎవరికీ తెలియదు. కానీ ప్రమోషన్లు మాత్రం చేశారు. ఆర్జీవీ టోటల్‌గా తన సినిమాలను పోర్న్ లెవన్ కంటెంట్ వైపు మార్చేసిన తర్వాత ఆయన తీసే సీరియస్ సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి తగ్గిపోయింది. అయినప్పటికీ సీఎం జగన్ ఆర్జీవీపై నమ్మకంతో కీలక బాధ్యతలిచ్చారు

## 29న తిరుపతిలో 'ఆత్మగౌరవ' ప్రదర్శన

తిరుపతి, అక్టోబరు 28,అభివృద్ధి వికేంద్రీకరణ కోసం మూడు రాజధానులే తమ విధానం అంటోంది అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటికే విశాఖలో పరిపాలనా రాజధాని డిమాండ్‌తో ఉత్తరాంధ్ర ప్రాంతాలని కలుపుకుని విశాఖ గర్జన జరిగింది.. నాన్ పొలిటిక్‌జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన విశాఖ గర్జనకు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపిన వైసీపీ.. ఈ కార్యక్రమంలో మంత్రలు, పార్టీ నేతలు పాల్గొనేలా చేసింది.. ఇప్పుడు సీమలోనూ మూడు రాజధానుల ఉద్యమానికి శ్రీకారం చుట్టింది.. మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతాం అంటున్న జగన్మోహన్‌రెడ్డి సర్కార్.. కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే కాదు.. ఈనెల 29న తిరుపతిలో ఆత్మగౌరవ మహా ప్రదర్శనకు సిద్ధమైంది.. దీనిపై తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి.. ఈ విషయాన్ని వెల్లడించారు.ఈనెల 29వ తేదీన మూడు రాజధానులకు మద్దతుగా తిరుపతిలో ఆత్మ గౌరవ మహా ప్రదర్శన నిర్వహించనున్నట్టు ప్రకటించారు భూమన కరుణాకర్ రెడ్డి.. రాయలసీమ గొంతును మహా ప్రదర్శన ద్వారా చాటిచేబుదాం అంటూ పిలుపునిచ్చారు.. రాయలసీమకు న్యాయ రాజధాని కావాలి? అప్పుడే వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి చెందుతుందన్న ఆయన.. ఏపీలో ఉత్తరాంధ్ర, రాయలసీమ బాగా వెనుకపడ్డాయి.. అందుకే సీఎం వైఎస్ జగన్.. మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు.. సీఎం జగన్ తీసుకున్న మంచి నిర్ణయాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబు తన స్వార్థ రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.. ఇక, ప్రాంతాలను రెచ్చగొట్టే విధంగా ధనిక రైతులు పాదయాత్ర కొనసాగుతోందని విమర్శించిన భూమన.. చంద్రబాబు నిర్ణయాలు రాయలసీమ వాసులను క్షోభకు గురిచేస్తోందని విరుచుకుపడ్డారు.. వైఎస్సార్ సీఎం అయ్యే వరకు రాయలసీమ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదన్న ఆయన.. రాయలసీమకు ఇప్పటికీ తీరని ద్రోహం చంద్రబాబు చేస్తున్నాడని ఆరోపించారు వైసీపీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి..

## వైజాగ్ లో శివంగి

విశాఖపట్టణం, అక్టోబరు 28, వైజాగ్ లో శివంగిఆమె ఒక్కతే.. వాళ్లు నలుగురు. పైగా వారి చేతిలో కత్తులున్నాయి. అయినా సరే, ఆ మహిళ ఏమాత్రం భయపడకుండా, వారిని ప్రతిఘటించింది. తీవ్ర గాయాలపాలైనా, లెక్క చేయకుండా వీర వనితలా ఎదురించింది. చివరికి వారి నుంచి తప్పించుకొని, ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన విశాఖ జిల్లాలో చోటు చేసుకుంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. పెందుర్తిలోని చీమలపల్లిలో ఉన్న చెరువుగట్టు ప్రాంతంలో ఆళ్ల అప్పారావు అనే కుటుంబం నివసిస్తోంది. ఆయన తన భార్య లలితకుమారి, ఇద్దరు కుమారులు (వినయ్‌కుమార్, అవినాష్‌కుమార్) కలిసి ఉంటున్నారు. ఆయన కుమార్లో ఒకరైన అవినాష్‌కు ఇటీవల లావణ్యతో వివాహం అయ్యింది. మంగళవారం రాత్రి ఎప్పట్లాగే అవినాష్ విధులకు వెళ్లారు. కుటుంబ సభ్యులంతా ఓ గదిలో ఉండగా.. మరొక గదిలో లావణ్య ఒక్కతే నిద్రిస్తోంది.కట్ చేస్తే.. అదే రోజు అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో, నలుగురు దుండగులు దొంగతనం చేసేందుకు వచ్చారు. ఇంటి కిటికీ గ్రిల్‌ను తొలగించి.. లోపలికి ప్రవేశించారు. అప్పటివరకూ చప్పుడు కాకుండా, జాగ్రత్తగా లోనికి వెళ్లారు. అత్త, మామయ్య, బావ పడుకున్న గదికి బయట నుంచి గడియ పెట్టేశారు. లావణ్య గది తలుపుని బద్దలుకొట్టి.. లోపలికి ప్రవేశించే ప్రయత్నం చేశారు. అయితే.. ఆ శబ్దానికి లావణ్య నిద్ర లేచింది. లావణ్య నిద్రలేచిన విషయం గమనించిన దుండగులు.. ఆమెని బందించేందుకు ప్రయత్నించారు. కానీ.. లావణ్య వారికి దొరక్కుండా తీవ్రంగా ప్రతిఘటించింది. గట్టిగా కేకలు వేసింది. ఈ క్రమంలో వాళ్లు ఆమెపై కత్తితో దాడి చేశారు. అయినా లెక్క చేయకుండా.. వారిని ఎదుర్కొని, గదిలో నుంచి బయటకు వచ్చి, గట్టిగా కేకలు వేసింది. అత్త, మామ, బావ పడుకున్న గదికి గడియ వేయడంతో.. వాళ్లు బయటకు రాలేకపోయారు.

## నాగరాజును నాగదేవతగా పూజించే దినమే నాగుల చవితి

-నేడు నాగుల చవితి పర్వదినం



భారతీయ సంస్కృతిలో 'నాగుపాము'ను పూజించే సంప్రదాయం ఉంది. సర్పాలకు అధిపతి అయిన నాగరాజును నాగదేవతగా పూజిస్తారు. దీపావళి అమవాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చవితి నాడు ఈ పండుగ జరుపుకుంటారు. కొంతమంది శ్రావణ శుద్ధ చతుర్థినాడు కూడా జరుపుకుంటారు. నాగుల చవితి గురించి..సర్పాలకు అధిపతి అయిన నాగరాజును ఈ రోజు పూజిస్తారు. దీపావళి అమవాస్య వచ్చే కార్తిక శుద్ధ చతుర్థి నాడు నాగుల చవితిని జరుపుకుంటారు. సాధారణంగా ఈ పండుగ వివాహిత మహిళలు తమ పిల్లల క్షేమం కోసం చేస్తారు. దేశంలో ఒక్కొక్కరు ఒక్కోలా జరుపుకుంటారు. అయితే మన తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో ఈ పండుగకు విశేష ఆదరణ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి మొదలవుతుంది. పాములు భూమి అంతర్భాగంలో జీవించి భూసారాన్ని కాపాడుతూ.. సమస్త జీవకోటికి నీటిని ప్రసాదించే దేవతలుగా తలుస్తారు. ఇవి పంటలను నాశనం చేసే క్రిమికీటకాలను తింటూ పరోక్షంగా రైతుకు పంటనష్టం కాకుండా చేస్తాయని నమ్ముతారు.నాగుల చవితి మంత్రం..పాములకు చేసే ఏదైనా పూజ, నైవేద్యం నాగదేవతలకు చేరుతుందని నమ్ముతారు. అందువల్ల ఈ రోజు ప్రజలు పాములను ఆరాధిస్తారు. అనేక సర్పదేవతలు ఉన్నప్పటికీ 12 మందిని మాత్రం నాగులు చవితి పూజా సమయంలో కొలుస్తారు. అంతేకాకుండా పాముకు పాలను సమర్పిస్తుంటారు. చవితి నాడు సర్పాలను పూజిస్తే కుజ దోషం, కాలసర్ప దోషానికి ఆదిదేవుడు సుబ్రహ్మణ్య స్వామి కాబట్టి నాగుపాము పుట్టకు పూజ చేస్తే కళత్ర దోషాలు తొలుగుతాయని శాస్త్రాలు సూచిస్తున్నాయి. అనంత,వాసుకి,శేష,పద్మ,కంబాల ,కర్కోటకం,ఆశ్వతార,ధృతరాష్ట్ర, శంఖపాల,కలియా,తక్షక,పింగళ ఈ ప్రపంచంలో పాములు, ఆకాశం, స్వర్గం, సూర్యకిరణాలు, సరస్సులు, బావులు చెరువులలో నివసిస్తున్నాయి. ఈ రోజు ఈ సర్పాలను పూజించి ఆశీర్వాదాలు పొందుతారు.

## టీడీపీ నేత కిమిడి కళావెంకట్రావు హౌస్ అరెస్టు

శ్రీకాకుళం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకట్రావు ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు. ఉమ్మడి శ్రీకాకుళంజిల్లా రాజాంలో మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు కళావెంకట్రావు ఇంటిని పోలీసులు చుట్టుముట్టారు. విశాఖపట్నంలోని ఋషికొండలో తవ్వకాలు, అక్రమ కట్టడాలకు నిరసనగా టీడీపీ పోరుబాట కార్యక్రమంనకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ముందస్తుగా ఇంటి వద్ద పోలీసులు మొహరించారు. శుక్రవారం తెల్లవారుజామునుంచి రాజాంలో అయన నివాసాన్ని చుట్టుముట్టారు. మరోవైపు, విశాఖ లో హై టెన్షన్ నెలకొంది. గురువారం రాత్రి నుండి టీడీపీ నేతలను హౌస్ అరెస్ట్ లు చేసారు. టీడీపీ కార్యాలయం చుట్టూ భారీగా పోలీసులు మోహరించారు. దశపల్లా హిల్స్, రుషి కొండ తదితర ప్రాంతాల్లో గురువారం నుండే పహారా కాస్తున్నారు. టీడీపీ నేతల పోరుబాటను అడ్డుకునేందుకు ముందస్తు చర్య లు పోలీస్ లు చేపట్టారు.

## గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న కొడాలి నాని

గుడివాడ గుడివాడ తొమ్మిదో వార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి నాని పాల్గొన్నారు. వీధి వీధినా ప్రజలు ఎమ్మెల్యే నానీకు ఘన స్వాగతం పలికారు. అధికార యంత్రాంగం తో కలిసి ఇంటింటికి తిరిగిన ఎమ్మెల్యే నాని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నాని తక్షణ చర్యలు తీసుకుంటూ, ప్రజల మౌలిక సమస్యలను తక్షణం పరిష్కరించాలని స్థానికంగా ఉన్న అధికారులను ఆదేశించారు. తొలుత వైసిపి నాయకులు ఉద్యోగ కిషోర్ ఇంటి వద్ద నుండి ఏర్పాటుచేసిన శిబిరంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించిన ఎమ్మెల్యే కొడాలి నాని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### పూజల కోసమే ఫాం హౌస్ కు వెళ్లాం

హైదరాబాద్, అక్టోబరు 28,మెయిన్‌బాద్‌లోని టీఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌజ్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే.. నాటకీయ పరిణామాల మధ్య నందకుమార్, సింహయాజులు, విష్ణువర్ధన్ రెడ్డిలను అరెస్ట్ చేశారు పోలీసులు. అనంతరం వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఏసీబీ న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. అయితే.. ఈ నేపథ్యంలో స్పష్టమైన ఆధారాలు లేవని న్యాయమూర్తి రిమాండ్‌ను తిరస్కరించడంతో నంద కుమార్, సింహయాజులు, విష్ణువర్ధన్‌రెడ్డిలను విడుదల చేశారు పోలీసులు. ఈ క్రమంలో నంద కుమార్ మాట్లాడుతూ.. పూజల కోసం మాత్రమే మేము ఫామౌస్ కు వెళ్ళామని వెల్లడించారు. ఎమ్మెల్యేల కొనుగోలు అంశంలో వాస్తవం లేదని ఆయన మండిపడ్డారు.ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫిర్యాదు చేసినట్టు మాకు తెలియదని, సింహయాజులు స్వామిజీ తో సామ్రాజ్య లక్ష్మి పూజ జరిపించడానికి మాత్రమే ఫాంహౌస్ కు వెళ్ళామన్నారు. మునుగోడు ఎన్నికల నేపథ్యంలోనే ఇదంతా చేస్తున్నారని, ఎన్నికలు కాబట్టే ఏలాంటి సమాచారంతో సోదాలు చేశారో మాకు తెలియదన్నారు. స్కామ్ ఎక్కడది.. అసలు ఏం స్కాం మాకు తెలియదని ఆయన అన్నారు. న్యాయాన్ని నమ్ముతున్నాం.. న్యాయ స్థానంలో న్యాయం గెలిచిందని, త్వరలో మీడియాకు అన్ని వివరాలు వెల్లడిస్తామని ఆయన వ్యాఖ్యానించారు.

# స్కూల్ టీచర్ నుంచి లాబీయింగ్ వరకు...

తిరుపతి, అక్టోబరు 28,మునుగోడు ఉప ఎన్నికల వేళ నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీకి చెందిన మధ్యవర్తులు కొనుగోలు చేస్తున్నారంటూ రేగిన వివాదం ఇప్పుడు రాష్ట్రంలో సంచలనం అయిన సంగతి తెలిసిందే. టీఆర్ఎస్ ఎమ్మెల్యే అందించిన సమాచారం మేరకు.. మొయినాబాద్ లోని ఓ ఫాంహౌజ్ లో బుధవారం రాత్రి వేళ సైబరాబాద్ పోలీసులు జరిపిన తనిఖీల్లో ఈ బండారం బయటపడింది. బీజేపీ ఆదేశాలతో రామచంద్ర భారతి, సింహయాజి, నందకుమార్ అనే ముగ్గురు వ్యక్తులు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కాషాయ కండువా కప్పుకొనేలా ప్రయత్నిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. అయితే, పట్టుబడ్డ ముగ్గురు నిందితుల్లో సింహయాజి నేపథ్యం మాత్రం కాస్త ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఎమ్మెల్యేల ప్రలోభాల వివాదంలో పట్టుబడిన సింహయాజి ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తి. ఆయన అసలు పేరు అశోక్. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం రామనాథపురం గ్రామానికి చెందిన ఈయన.. 20 సంవత్సరాల క్రితం సొంత ఊర్లోనే ఓ చిన్నపాటి ప్రైవేటు స్కూలు నడిపేవారు. అందులో నష్టాలు రావడంతో స్కూలు ఎత్తేసి, మరో ప్రైవేటు స్కూలులో టీచర్ గా పని చేశారు. కట్ చేస్తే 10 ఏళ్ల తర్వాత ఇప్పుడు స్వామిజీ అవతారం ఎత్తారు. రామనాద పురంలో శ్రీమంత్ర రాజపీఠం ఏర్పాటు చేశారు. దానికి తాను పీఠాధిపతిగా స్వయంగా ప్రకటించుకొని కొనసాగుతున్నారు.ఈ గ్రామంలోనే నరసింహ స్వామి ఆలయాన్ని పునరుద్ధరణ చేయడానికి 10 ఏళ్ల కిందట ప్రయత్నం చేసిన వ్యవహారం బెడిసి కొట్టింది. ఆ ప్రాంతంలో ఎవరూ ఆయన్ని స్వామిజీ గా విశ్వసించకపోవడంతో తిరుపతికి మకాం మార్చారు. 15 ఏళ్లుగా అక్కడే ఓ పీఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నాలుగేళ్లకు ఓసారి స్వగ్రామం రామనాథపురానికి వచ్చి వెళ్తుంటారని ఆ ఊరి వారు చెప్తుంటారు. ఇప్పుడు హైదరాబాద్‌లో మునుగోడు ఎన్నికల సందర్భంగా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన వివాదంలో చిక్కుకున్నారు. మొత్తం ముగ్గురిలో ఈయన కూడా ఉండడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫిర్యాదుతో మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో సింహయాజి స్వామిజీ, నందు, సతీష్ లపై కేసు నమోదైంది. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ 1998 సెక్షన్ కింద కేసు పెట్టారు. బీజేపీలో చేరేందుకు 100 కోట్ల రూపాయల ఆఫర్... ఎమ్మెల్యేలను తీసుకొస్తే 50 కోట్ల రూపాయల ఆఫర్ ఇస్తామని ప్రలోభపెట్టినట్లు పైలెట్ రోహిత్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ నిందితుల్లో ఒకరైన నందకుమార్ హైదరాబాద్ లోని చైతన్యపురిలో ఉంటారని తెలుస్తోంది. ఈయన గతంలో అంబర్ పేట శివం రోడ్డులో హోటల్ ప్రారంభించారు. క్యాటరింగ్ రంగంలోకి దిగి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు, ధనవంతులకు క్యాటరింగ్ చేస్తుండేవారు.మరోవైపు, పట్టుబడ్డ ఈ ముగ్గురు నిందితులు రామచంద్ర భారతి అలియాస్ సతీశ్ శర్మ, నందకుమార్, సింహయాజి స్వామి ముగ్గురూ గతంలో బీజేపీ అగ్ర నేతలతో కలిసి ఉన్న ఫోటోలను మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. రామచంద్ర భారతి గతంలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ఉన్న ఫోటో వైరల్ గా మారింది. కిషన్ రెడ్డితో నందకుమార్, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో సింహయాజి, కిషన్ రెడ్డిని సింహయాజి దీవిస్తున్నట్లు ఉన్న ఫోటోలను కిషన్ రెడ్డి ట్వీట్ చేశారు.

# బాలినేని వర్సెస్ వైవీ





ఒంగోలు, అక్టోబరు 28, కరు స్వయానా ఏపీ సీఎం జగన్ చిన్నాన్న.. మరొకరు మామ.. అంతేకాదు.. వీరిద్దరూ బావ బామ్మర్దులు.. జగన్ కుడి ఎడమ భుజాలుగా ఉంటారు. ఇప్పుడు వీరు ఢీ అంటే ఢీ అంటున్నారు. వీరిలో ఒకరు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.. మరొకరు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి. ఇరువురూ వైసీపీలో కీలక నేతలు. ఇటీవలి కాలం వరకూ కలిసి ఉన్న వీరు.. ఇప్పుడు కస్సు బుస్సు అంటున్నారట. వైవీఎస్– బాలినేని తీరుతో జగనన్నకు తల బొప్పికట్టిందని, ఇరువురి మధ్యా విభేదాలు కార్యకర్తలను ఇరకాటంలో పడేశాయని అంటున్నారు. తాజాగా ఒంగోలులో శ్రీనివాస కల్యాణం జరిపించే విషయంలో వీరి మధ్య విభేదాలు బట్టబయలయ్యాయన్నారు.రాజకీయంగా తొలుత కలిసి ఉన్న వైవీ సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాస్ రెడ్డి మధ్య తర్వాత మనస్పర్థలు పెరిగిపోయాయి. క్రమేపీ పార్టీలో ఎవరి దారి వారిదే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వీరి అనుచరులు కూడా అందుకు భిన్నంగా లేరంటున్నారు. చివరికి కుటుంబ వేడుకలో, దేవుడి కార్యక్రమం శ్రీనివాస కల్యాణం ఏర్పాటు విషయంలోనూ వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. చినికిచినికి గాలివానలా మారి వ్యవహారం జగన్ దాకా వెళ్లడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం అయింది.బాలినేని శ్రీనివాస్ రెడ్డి మనవడి పుట్టినరోజు నవంబరు 9. ఆ సందర్భంగా అదే రోజు ఒంగోలులో శ్రీనివాస కల్యాణం జరిపించాలనుకున్నారు. నిబంధనల ప్రకారం 3 నెలల ముందే టీటీడీకి శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తు చేశారు. ఈఓ ధర్మారెడ్డి ఆయనకు సన్నిహితుడు కావడంతో అనుమతి తొందరగానే లభించింది. బాలినేని ఆ వెంటనే స్వామి దర్శనానికి వెళ్లి అనుమతి పత్రాలు అందుకున్నారు. 9న ఒంగోలులో ప్రజల శ్రేయస్సు కోసం శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 50 వేల మంది భక్తులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆ తర్వాతే అసలు కథ మొదలైంది.టీటీడీ చైర్మన్ ను సంప్రదించలేదంటూ.. శ్రీనివాస కల్యాణం నిర్వహణకు సహకరించలేమంటూ కొద్ది రోజుల కిందట టీటీడీ అధికారుల నుంచి బాలినేనికి సమాచారం వచ్చిందట. టీటీడీ చైర్మన్ ను సంప్రదించలేదనీ.. కనీసం పాలకమండలికైనా లేఖ పంపలేదనే సాకుతో అనుమతులు నిలిపేశారట. దీంతో బాలినేనికి కోపం వచ్చింది. ఇచ్చిన అనుమతులు ఎలా రద్దుచేస్తారని బాలినేని ప్రశ్నించారట. అయినా చైర్మన్ ని కాదని ఎవరూ సమాధానం చెప్పలేదట. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల కిందట సీఎంను కలిసిన బాలినేని సుబ్బారెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తన మనవడి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని, వైవీ జోక్యంతోనే ఇదంతా జరిగిందని ఆరోపించినట్లు సమాచారం. తాను కూడా చాలా అడ్డంకులు సృష్టించగలనని, సీఎం సూచనలతో సర్దుకుపోతున్నానని చెప్పారని తెలిసింది.బాలినేని ఫిర్యాదుపై పరిశీలించి చర్యలు తీసుకుంటానని సీఎం జగన్ హామీ ఇచ్చినట్లు సమాచారం. తర్వాత వైవీని పిలిపించి జగన్ మాట్లాడారు. ఒంగోలులో శ్రీనివాస కల్యాణం నిర్వహణకు ఆటంకం లేకుండా చూడాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇంతలో బాలినేని నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లడంతో వివాదం ముదిరిందని, ఒంగోలులో శ్రీనివాస కల్యాణం ఇక లేనట్లే అని ప్రచారం జరిగింది. అయితే తాజాగా శ్రీనివాస కల్యాణం నిర్వహణకు టీటీడీ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలిసింది.వాస్తవానికి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మధ్య విభేదాలు చాలాకాలం నుంచే ఉన్నాయి. జగన్ జోక్యం చేసుకుని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీ బాధ్యతలను బాలినేనికి కేటాయించి... ఉత్తరాంధ్ర బాధ్యతలు వైవీకి అప్పగించారు. అయినా ఇద్దరూ కలవకపోగా పంతాలకు పోయి ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటుండడం గమనార్హం.

# కడప నగర అభివృద్ధికి కృషి

### కమీషనర్ జి ఎస్ ఎస్ ప్రవీణ్ చంద్

కడప మార్నింగ్ విసిట్ లో భాగంగా కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెల్లవారుజామున 5 గంటల నుండి కడప నగర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పలు నిర్మాణ పనులను పరిశీలించారు రాజీవ్ పార్క్ రాజీవ్ మార్గ్ రోడ్ రాజీవ్ పార్క్ నందు ప్లే ఈక్వప్మెంట్స్,ఓపెన్ జిమ్, కరెంట్ వర్క్స్ కి సంబందించిన పరికరాలను తెప్పించుకోవాలని ఆదేశించారు,పార్క్ చుట్టు ప్రక్కల గ్రీనరీని అభివృద్ధి చేయాలని, పార్క్ ఆవరణలో సీజన్ల వారీగా పూల మొక్కలు మారుస్తూ సుందరీకరణ పై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఎ పి హెచ్ బి కాలనీ యూ పి హెచ్ సి కి అవసరమైన టైల్స్, డోర్స్ శానిటరీ వేర్ ని సమకూర్చుకొని నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయవలయు నని కమిషనర్ సంబంధిత కాంట్రాక్టర్ ను అధికారులను ఆదేశించారు. నాగరాజు పేట 02 యూ పి హెచ్ సి నిర్మాణ విధులు జాప్యం చేయకుండా , నవంబర్ 15 నాటికి యు. పి. హెచ్. సి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని సంసిద్ధంగా ఉండాలని కాంట్రాక్టర్ సంబంధిత అధికారులకు కమిషనర్ చెప్పారు. ఎన్ జి ఓ కాలనీ యూ పి హెచ్ సి పనులు వేగవంతంగా చేపడుతూ, స్లాబ్ లెవెల్ వర్క్ పూర్తి చేస్తూ అవసరమైన నిర్మాణ పరికరాలను ఇంటీరియర్ ఎక్విప్మెంట్ ను సమకూర్చుకొని భవన నిర్మాణాన్ని పూర్తి చేయవలెనని అధికారులను ఆదేశించారు.అప్సర ఎస్ డి ఆర్ ఎఫ్ వర్క్ :– అప్సర సర్కిల్ డ్రైన్ వర్క్ నవంబర్ 4 లోపు పూర్తి చేయవలయునని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. సంజన్న సర్కిల్ ఎస్ డి ఆర్ ఎఫ్ వర్క్స్:– సదరు ప్రాంతంలో కల్వర్ట్ రాంప్ వర్క్ మొదలు పెట్టాలని నవంబర్ 5 లోపు పూర్తి చేయవలయునని సర్కిల్ సమీపంలో ఉ న్నటువంటి శ్మశానవాటిక (బరియల్ గ్రౌండ్) ప్రహరీ గోడలకు పెయింట్ ఆర్ట్స్ వేయించ వలయునని కమిషనర్ కాంట్రాక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు వై. ఎస్. ఆర్ కాలనీ యూ పి హెచ్ సి:– ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చివరి దశలోని పెండింగ్ వర్క్స్ అన్నింటినీ నవంబర్ 5 లోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చెయాలాని గౌరవనీయులైన కమిషనర్ అధికారులను ఆదేశించారు. పాత కడప యూ పి హెచ్ సి: భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైన కన్స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ ఇంటీరియర్ ఎక్విప్మెంట్ ను ముందస్తుగా సమకూర్చుకొని ప్లాస్టింగ్, పెయింటింగ్ వర్క్స్ చేస్కొని నవంబర్ 15 లోగా భవనమును పూర్తి స్థాయిలో నిర్మించి ప్రజలకు సేవలందించాలని కమిషనర్ ఆయా శాఖాధికారులకు చెప్పారు రాయచోటి ఫ్లై ఓవర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న పార్క్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, ప్రజలకి వినోదాన్ని పంచే ప్లే ఎక్విప్మెంట్ ను ఏర్పరచి, పార్క్ చుట్టు ప్రక్కల పార్క్ ఆవరణలో లో పచ్చదనాన్ని పెంపొందించాలని పలు సలహాలతో కూడిన ఆదేశాలను సంబంధిత అధికారులకు జారీ చేసారు

### ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా నియోజకవర్గ సమీక్ష వినతులపై సత్వరమే చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్

తిరుపతి, అక్టోబర్ 28:. గౌ.ముఖ్యమంత్రి గారి క్యాంప్ కార్యాలయంలో ఆగష్టు 3 న జరిగిన తిరుపతి జిల్లా నియోజకవర్గ ఎం.ఎల్.ఎ లు, ఎం.పి. తదితర ప్రజా ప్రతినిధుల ముఖ్యమంత్రి సమీక్షలో వారు తెలిపిన అంశాలపై మరియు వినతులపై చేపట్టిన చర్యలపై జిల్లా అధికారులతో కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి మరియు జాయింట్ కలెక్టర్ డి.కే. బాలాజీ సంయుక్తం గా సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సంక్షేమ, అభివృద్ధి మరియు ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పై అంశాలపై చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్షిస్తూ ముఖ్యమంత్రి గారి సమీక్షలో వచ్చిన అంశాలు, వినతులపై అధికారులు సత్వరమే నివేదికలు తయారుచేసి సంబందిత రాష్ట్ర స్థాయి అధికారులకు పంపుతూ వాటి ప్రతిని మరియు పురోగతిని ముఖ్యమంత్రి కార్యదర్శి కార్యాలయముకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులు వారి శాఖకు సంబందించిన వాటిపై ఎస్టిమేట్లు సిద్ధం చేసి వారి శాఖల ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. పుత్తూరు సి.హెచ్.సి. ఆసుపత్రి 30 బెడ్ ల నుండి 100 బెడ్ ల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయడం, వెంకటగిరి నందు స్కిల్ డెవలప్మెంట్ కళాశాలకు , వేంకటగిరి నందు డయాలసిస్ సౌకర్యం తో 100 బెడ్ ల ఆసుపత్రి, ట్రామా కేర్ యూనిట్, రోడ్ల ఏర్పాట్లు, మరమ్మత్తులు తదితరాలైన అన్ని నియోజకవర్గాల అన్ని రకాల ప్రతిపాదనలు వచ్చే సోమవారం నాటికి పూర్తి స్థాయిలో తయారు చేసి పంపేలా ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రహదారి భవనాల అధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ మరియు సాదికార సంస్థ అధికారి చెన్నయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్ మోహన్, జిల్లా సర్వే అధికారి జయరాజ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోవూరు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో పాల్గొన్న పేర్నాటి.



కోవూరు మండలం...,.నెల్లూరు జిల్లా, కోవూరు మండల పరిధిలోని కోవూరు చిన్న పదుగుపాడులోని రుక్మిణి కళ్యాణ మండపం నందు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన "కోవూరు నియోజకవర్గ గ్రాడ్యుయేట్స్ మరియు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశంలో ప్రసంగించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాకు పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు. నా అభ్యర్థిత్వానికి సహకరించిన తూర్పు రాయలసీమకు సంబంధించిన ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా నేడు చాలా శుభదినం అని, ముఖ్యమంత్రి ముత్తుకూరులో జరిగిన సభలో గత నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన నెల్లూరు బ్యారేజికి దివంగత మంత్రి, గతంలో జిల్లా రాజకీయాలను రాష్ట్ర రాజకీయాలను ఒంటి చేత్తో నడిపించిన నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరును పెట్టడం అత్యంత సంతోషమైన విషయమని తెలిపారు.అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలైందని, వచ్చే నెల నవంబర్ 7వ తేదీ వరకు మాత్రమే ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, మిగిలిన వారందరూ కూడా వాళ్ళ ఓట్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రసన్న అన్న ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఇంతకు పూర్వమే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి, ఓటర్లను నమోదు చేయించారని, 2019 అక్టోబర్ నాటికి డిగ్రీ పాసైన వారు ఈ ఎన్నికలకు అర్హులని, భారతదేశంలో ఏ యూనివర్సిటీలో చదివినవారైన తమ ఓటును చేసుకోవచ్చు అని తెలిపారు. అందరూ కూడా సహకరించి నా అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని కోరారు.ఆశీర్వదించి, మన ముందుకు పంపించారని, నా తమ్ముడు శ్యామ్ మంచి వ్యక్తిని, అందరితో కలిసఉద్యోగ నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్న గ్రాడ్యుయేట్ సమాచార సేకరించి వారి ఓట్లను, నమోదు చేసే విధంగా చేయాలని తెలిపారు, మనకి ఓటరు నమోదు కార్యక్రమం చాలా ముఖ్యమైన అంశమని, సమయం తక్కువ ఉన్నందున మీరందరూ కూడా రోజుల్లో కొంత సమయాన్ని ఈ కార్యక్రమం కోసం తప్పకుండా కేటాయించాలని తెలిపారు, 2017 సంవత్సరంలో 7000 మంది కోవూరు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లుగా ఓటు నవోదు చేసుకున్నారని, అవన్నీ కూడా రద్దు అయ్యాయని, కోవూరు నియోజకవర్గంలో పదివేలకు తగ్గకుండా ఓట్లను నమోదు చేసే విధంగా పని చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం చేయకుండా పార్టీ ఆదేశించిన కార్యక్రమాలలో కచ్చితంగా పాల్గొనాలని తెలిపారు. ఎన్నికల్లో పట్టబద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల్లో మనక నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## ట్రాన్స్ జెండర్స్ కు ఉచిత న్యాయ సహాయం పై న్యాయ విజ్ఞాన సదస్సు





కడప అక్టోబర్28:: కడప నగర.ములోని కడపజిల్లా కోర్టు లో శ్రీమతి ఎస్.కవిత, సెక్రెటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ, కడప వారు న్యాయ సేవా సదన్ కడప నందు ఉచిత న్యాయ సహాయం అను అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. జిల్లాలోని ప్రతి కోర్టులలో మండల న్యాయ సేవా సమితిలు ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్నవారు ఆయా కోర్ట్ లలో ఉన్న మండల న్యాయ సేవా సమితిలను సంప్రదించి ఉచిత న్యాయ సహాయమును పొందవచ్చును. సెక్షన్ 12 లీగల్ సర్వీస్ అథారిటీ ఆక్ట్ 1987 గురించి వివరించారు. ఫ్రీ లిటిగేషన్ కేసులపై అవగాహన కలిగించారు. జాతీయ లోక్ అదాలత్ ల పైన అవగాహన కలిగించారు. రాజీ మార్గమే రాజ మార్గము. సత్వర పరిష్కారానికి మార్గము లోక్ అదాలత్. లీగల్ ఎయిడ్ క్లినిక్స్, ప్యానల్ న్యాయవాదులు, పార లీగల్ వాలంటరీల విధివిధానాలు తెలియజేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవా సమితి విధివిధానాలు తెలియజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్, డిజబులిటీ జీఎశ్రీవట, ట్రాన్స్ జెండర్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ అధికారి ఖీ.ఎ.కృష్ణ కిషోర్ మరియు ట్రాంజెండర్స్ పాల్గొన్నారు.

# నంద్యాల మూలమఠం లో చిన్నారి హిమ పావని భౌతిక కాయానికి భాధా తప్త హృదయంతో నివాళులర్పించిన యం యల్ సి ఇసాక్ బాషా .



నంద్యాల అక్టోబర్ 28 సోమవారం ఆళ్లగడ్డ లో జరిగిన రైతు భరోసా సభ అనంతరం హిమ పావని తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసి పాప యొక్క మెదడుకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను తెలియజేశారు. సీఎం జగన్మోహన్ రెడ్డి వెంటనే స్పందించి పాప మెరుగైన చికిత్సకు మొదట లక్ష రూపాయలు చెక్ అందించి తర్వాత హైదరాబాదులోని సిటీ న్యూరో సెంటర్ నందు పాప బ్రెయిన్ ఆపరేషన్ కు ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని హిమ పావని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు పాపను హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో ఉన్న సిటీ న్యూరో సెంటర్ నందు 20-10-2022 గురువారం అడ్మిట్ చేయించుకొని 26-10-2022 బుధవారం వరకు ఈ ఆరు రోజులు రక్త పరీక్షలు,ఓఖీఎ స్కానింగ్ అన్ని పరీక్షల అనంతరం 27-10-2022 గురువారం రోజు మధ్యాహ్నం1:00 గంటకు డాక్టర్లు ఆపరేషన్ చేయడం మొదలుపెట్టారు. సాయంత్రం 5:00 గంటలకు ఆపరేషన్ సక్సెస్ అయిన గంట తర్వాత 6:00 గంటలకు పాప షాక్ గురైందని హార్ట్ బిట్ తక్కువగా కొట్టుకుంటుందని డాక్టర్లు పాప బ్రతకడానికి అన్ని విధాల ప్రయత్నాలు చేశారు. ఆపరేషన్ అనంతరం హార్ట్ బిట్ తక్కువగా కొట్టుకోవడం వలన డాక్టర్లు చేసిన ప్రయత్నాలకు కూడా కోలుకోలేక చివరికి కన్నుమూయడం జరిగినది. హిమపావని పాప ఆరోగ్యం మెరుగు కావడం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి , గతంలో దాతల సహకారంతో నంద్యాలలోని స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి అన్ని విధాలుగా ప్రయత్నాలు చేసిన చివరికి కన్నుమూయడం చాలా బాధాకరమని హిమపావని యొక్క ఆత్మ శాంతి కలగాలని పాప యొక్క తల్లిదండ్రులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆ దేవుడిని ప్రార్థిస్తూ..నివాళులు అర్పించిన యం యల్ సి ఇసాక్ బాషా ,నంద్యాల మున్సిపల్ చైర్మన్ శ్రీమతి మాబున్నిసా ,వైస్ చైర్మన్లు పాం శా వలి, గంగిసెట్టి శ్రీదర్ ,

## జగనన్న క్రీడ సంబరాలు పోస్టర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఐఏఎస్

నంద్యాల అక్టోబర్ 28, )రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 21వ తేదీ 2022 ఏపీ సీఎం శ్రీ జగన్మోహన్ రెడ్డి × ×జన్మదినని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి 50 లక్షల నగదు బహుమతి క్రీడా పోటీలు నిర్వహించబడును. కబడ్డీ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ మెన్ అండ్ ఉమెన్ షటిల్ బ్యాట్మెంటన్ మెన్ అండ్ ఉమెన్ సింగిల్స్ అండ్ డబుల్ క్రికెట్ మెన్ క్రీడాంశాలలో క్రీడా పోటీలను నిర్వహించబడును ఈ రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా ఐదు లక్షలు రెండో బహుమతిగా మూడు లక్షలు మూడో బహుమతిగా 2 లక్షలు నాలుగో బహుమతిగా లక్ష రూపాయలు లను బహుమతిగా ఇవ్వబడును.. ఈ క్రీడా పోటీలు మొదటి స్థాయిలో అసెంబ్లీ నియోజక స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అదేవిధంగా జోనల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయబడును. అని జిల్లా క్రీడల అధికారి ఎం ఎన్ వి రాజు తెలియజేశారు.

# శాసనసభ్యులు చెన్నకేశవరెడ్డి గారిని బిసి సంఘాలు కలుద్దాం



ఎమ్మిగనూరు పట్టణం అక్టోబర్ 28 నందు శుక్రవారం రోజు ముఖ్య కూడలిలో జ్యోతి రావ్ పూలే విగ్రహం స్థలం నకు స్థానిక శాసనసభ్యులు ఎర్రకోట చెన్న కేశవరెడ్డి ని బిసి సంఘాల అద్వర్యంలో అందరు కలసి వినతి పత్రం అందచెయ్యలని బిసి సంఘాల ఐక్య వేదిక ( అడహాక్ ) కమిటి కన్వినర్లు ,కో" కన్వినర్లు యం ఆర్ శ్రీనివాసులు

--అడహాక్ కమిటి

,గడిగే లింగప్ప,కుమ్మరి పాండు రంగ స్వామి ,శాసం శివదాసు,ఎపి ఈరన్న,వీఠల్ రావ్ ,మదుబాబు నాయుడు,బి.ప్రసాద్ ,కలసి తోగట వీరక్షత్రియ సంఘం అద్యక్షలు బాణా రామస్వామి,చాత్తద్దు శ్రీ వైష్ణవ సంఘం అద్యక్షలు నెమ్మి గిరిస్వామి అసంఘ అద్యక్షలకు వినతి పత్రం అదజెశారు.అడహాక్ కమిటి సభ్యులు మాట్లడుతూ జ్యోతి రావ్ పూలే అణచివేతకు గురైన బడుగు బలహిన వర్గాల ప్రజలకు అత్మస్థైర్యం కల్పించి బడుగు బలహిన వర్గల వారి సాధి కారత కోసం కృషి చేసిన మహానీయుడు ప్రపంచానికే జ్యోతి రావ్ పూలే జీవితం ఆదర్శం అని చెప్పవచ్చు విద్య వివక్ష,పేదిరికం ,ఆర్ధి అసమానత్వం నిర్మూలించడానికి ఎంతో కృషి చేశాడని ,కుల,మత,రహిత సమాజ నిర్మించడానికి ఎనలేని,కృషి చేశారని అలాంటి మహను బావుడి విగ్రహం స్థలంకు స్థానిక శాసనసభ్యులు చెన్న కేశవ రెడ్డి సహకరిస్తారని అశా భవం వ్యక్తం చేశారు.దాదాపుగా ఎమ్మిగనూరు నియోజక వర్గం లో ఉండు 65% ఉన్న బిసి కుల సంఘాల అత్మగౌరవం కాపాడు తారని నమ్మకం బిసి కుల సంఘాలకు ఉందని అందుకని ప్రతి ఒక్క కుల సంఘానాయకులు కదిలి రావలని ఇప్పటికె 16 కుల సంఘా నాయకులకు విజ్ఞప్తి చేస్తూ "అడహాక్ " కమిటి తరపున వినతి పత్రం అందించామని జ్యోతిరావ్ పూలే విగ్రహం స్థలం కేటాయిస్తారని శాసనసభ్యులు చెన్నకేశవ రెడ్డి మీద నమ్మకం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో తొగట నరసింహులు,మంగళి గిడ్డయ్య,జిలకర శ్రీనివాసులు,నెమ్మి నరసింహులు,పూజారి లక్ష్మన్న బిసి సంఘ నాయకులు పాల్గోన్నారు.

# నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కు గవర్నర్ అవార్డు

నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్లకు గవర్నర్ అవార్డు లభించింది. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం ఏపీ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం చైర్మన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు విశ్వభూషన్ హరిచందన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020-21 సంవత్సరానికి గాను అత్యధిక సభ్యత్వాలు చేయించిన వారికి రెడ్ క్రాస్ సంస్థలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గవర్నర్ అవార్డును రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర సెక్రటరీ ఏకే ఫరీదా ఐఏఎస్ గార్ల చేతులమీదుగా అందుకోవడం జరిగిందన్నారు.




ఈ అవార్డు అందుకున్న వారిలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి 2019- 20, 2020- 21 సంవత్సరాలలో కర్నూలు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కేజీ గోవింద్ రెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, రిటైర్డ్ ఇఎన్ టి వైద్యులు డాక్టర్ మహేంద్రకుమార్, మాజీ రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీనివాస్, డిఎంహెచ్ఓ కార్యాలయ సూపరిండెంట్ అరుణ తదితరులున్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తేలకపల్లి రాధాకృష్ణయ్య , నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ కమిటీ ట్రెజరర్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఉస్మాన్ బాష, నాగశేషులు, సురేంద్ర, యాకూబ్, సీనియర్ సభ్యులు నాగేశ్వరరెడ్డి, నాగరాజు, సురేష్, డిఎఫ్ఓ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలానీ సమూన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విస్తృత పరుస్తామన్నారు.

## రైస్ మిల్ యంత్రంలో పడి మహిళ మృతి

బిక్కవోలు తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం రైస్ మిల్ లో పడి మహిళ మృతి చెందింది. రైస్ మిల్లులో పనిచేస్తున్న దుర్గా అనే మహిళ కూలీ గురువారం జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. ఘటన బిక్కవోలు మండలం తోస్సిపూడి గ్రామంలో చోటుచేసుకుంది. తోస్సిపూడి బుచ్చియ్యమ్మ రైస్ మిల్లులో తొస్సిపూడి గ్రామానికి చెందిన దుర్గ (38) పని చేస్తుండగా ఆమె చీర రైస్ మిల్లులోని మిషన్లో పడడంతో చీరతో పాటు ఆమెను యంత్రాలు బలంగా లాగాయి. దీంతో కిందపడిన ఆమె తలకు బలమైన గాయమవడంతో.ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.


# 'పుష్ప 3' కోసం కూడా ప్రిపరేషన్స్ మొదలయ్యాయా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన యాక్షన్ డ్రామా 'పుష్ప : ది రైజ్'. టాలీవుడ్ లో స్టైలిష్ స్టార్ గా పేరు తెచ్చుకున్న బన్నీ ఈ సినిమాలో ఫస్ట్ టైమ్ ఊర మాస్ పాత్రలో కూలోడిగా నటించి సరికొత్త మేకోవర్ తో షాకిచ్చాడు. గత చిత్రాలకు పూర్తి భిన్నమైన మేనరిజమ్స్ ఆహార్యంతో బన్నీ కనిపించిన తీరు దేశ వ్యాప్తంగా అన్ని భాషలకు చెందిన ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుని పాన్ ఇండియా స్టార్ ని చేసింది. స్టార్ డైరెక్టర్ సుకుమార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ మూవీకి వరల్డ్ వైడ్ గా మంచి క్రేజ్ లభించడంతో దీనికి సీక్వెల్ గా రానున్న'పుష్ప2'పై అంచనాలు ఏర్పడ్డాయి.ఈ నేపథ్యంలో పార్ట్ 1 కి మించి 'పుష్ప 2'ని తెరపైకి తీసుకురావాలని దర్శకుడు సుకుమార్ తో పాటు మేకర్స్ కూడా భారీ ప్లాన్స్ చేస్తున్నారు. ఉత్తరాదిలోనూ ఈ మూవీకి ఊహించని విధంగా ఆదరణ లభించడంతో సీక్వెల్ ని మరిన్ని ప్రత్యేకతలతో తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. ఇందులో భాగంగా పార్ట్ 2 కోసం బడ్జెట్ ని భారీగా పెంచేసిన మేకర్స్ భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలని పూర్తి చేసిన చిత్ర బృందం ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అంతే కాకుండా రీసెంట్ గా హీరో అల్లు అర్జున్ కు లుక్ టెస్ట్ కు సంబంధించిన ప్రత్యేక ఫొటో షూట్ ని కూడా నిర్వహించారు. త్వరలో సెట్స్ పైకి రానున్న ఈ మూవీకి సంబంధించి రోజుకో వార్త ఆసక్తిని రేకెత్తిస్తూ 'పుష్ప 2'పై అంచనాల్ని పెంచేస్తోంది. మారేడుమిల్లి లో 'పుష్ప' కు సంబంధించిన కీలక ఘట్టాలని చిత్రీకరించారు. 'పుష్ప 2'ని కూడా అక్కడే షూట్ చేయబోతున్నారట. అంతే కాకుండా విదేశాల్లోనూ పలు కీలక ఘట్టాలని చిత్రీకరించనున్నారని తెలుస్తోంది.థాయ్ లాండ్ లో బన్నీపై భారీ స్థాయిలో పులి ఫైట్ ని షూట్ చేయడానికి సుకుమార్ ప్లాన్ చేస్తున్నారని కూడా వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో తాజాగా మరో ఆసక్తికరమైన వార్త బయటికి వచ్చింది. ముందు ఒకే భాగంతో ఫినిష్ చేయాలనుకున్న సుకుమార్ కథ డిమాండ్ మేరకు పార్ట్ 2ని కూడా ప్లాన్ చేసి క్లైమాక్స్ ఎండింగ్ లో రివీల్ చేసిన విషయం తెలిసిందే. అదే తరహాలో ఈ మూవీకి పార్ట్ 3ని కూడా తెరపైకి తీసుకురాబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.'పుష్ప 2' క్లైమాక్స్ లో పార్ట్ 3 కోసం భారీ ట్విస్ట్ ని రివీల్ చేయబోతున్నారట. ఇది పార్ట్ 3కి లీడ్ కానుందని చెబుతున్నారు. ఇది ఎంత వరకు నిజం అన్నది తెలియాలంటే మేకర్స్ నుంచి కీలక అప్ డేట్ బయటికి రావాల్సిందే. అయితే ఈ వార్త మాత్రం బన్నీ ఫ్యాన్స్ ని ఫుల్ ఖుషీ చేస్తున్నాట్టుగా తెలుస్తోంది. 'పుష్ప'ని పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించి సంచలనం సృష్టించిన సుకుమార్ పార్ట్ 2తో మరో లెవెల్ మూవీని అందించబోతున్నాడని తెలుస్తోంది.

# ఓటీటీ ప్రియులకు అమెజాన్ గుడ్ న్యూస్!

కరోనా తరువాత ప్రేక్షకులు థియేటర్లలకు రావడం తగ్గించేశారు. థియేటర్లకు మించి ఓటీటీలకు ఎడిక్ట్ అయిపోయారు. దీంతో ఓటీటీలకు ఆదరణ పెరగడం మొదలైంది. ప్రతీవారం థియేటర్లలో రిలీజ్ అయ్యే సినిమాల కంటే పాపులర్ ఓటీటీ ప్లాట్ ఫామ్ లలో స్ట్రీమింగ్ అవుతున్న సినిమాలు వెబ్ సిరీస్ లపై ఓటీటీ ప్రియులు సినీ లవర్స్ అమితాసక్తిని చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో థియేటర్లలో రిలీజ్ అయిన సినిమాలు ఎప్పుడెప్పుడు ఓటీటీలలో స్ట్రీమింగ్ అవుతాయా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న వేళ అమెజాన్ ప్రైమ్ గుడ్ న్యూస్ చెప్పేసింది.డిజిటల్ వరల్డ్ లో ఇప్పటి వరకు నెట్ ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్ ఫామ్






దే పైచేయిగా కనిపిస్తూ వస్తోవంది. ఇటీవల 'ఖీఖీఖీ'తో మరింత క్రేజ్ ని సొంతం చేసుకుని టాప్ లో నిలిచింది. అయితే ఆ ఆధిపత్యాన్ని అధిగమించడానికి అమెజాన్ ప్రైమ్ గత కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన బ్లాక్ బస్టర్ అమెజాన్ కు దక్కడం లేదు. తాజాగా అలాంటి రెండు బ్లాక్ బస్టర్ సినిమాల స్ట్రీమింగ్ హక్కుల్ని తాజాగా అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకుంది.ఇటీవల భారీ స్థాయిలో విడుదలై పాన్ ఇండియా సినిమాలుగా సంచలనం సృష్టించిన 'పొన్నియిన్ సెల్వన్ 1' కన్నడ సెన్సేషన్ 'కాంతార' చిత్రాల స్ట్రీమింగ్ హక్కుల్ని అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకుంది. అంతే కాకుండా ఈ రెండు సినిమాలు నవంబర్ లో స్ట్రీమింగ్ కాబోతున్నాయి. మణిరత్నం డ్రీమ్ ప్రాజెక్ట్ గా 'పొన్నియిన్ సెల్వన్ 1'ని తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఇందులో విక్రమ్ కార్తి ఐశ్వర్యా రాయ్ త్రిష జయం రవి కీలక పాత్రల్లో నటించారు.బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ఈ మూవీని తెలుగుతో పాటు ఇతర భాషల్లో చూడని వారు చాలా మందే వున్నారు. వారికి నవంబర్ నెల బ్లాక్ బస్టర్ మంత్ అని చెప్పుకోవచ్చు. ఇక ఇదే నెలలో రిషబ్ శెట్టి సెన్సేషనల్ మూవీ 'కాంతార' కూడా స్ట్రీమింగ్ కాబోతోంది. నవంబర్ 4న ఈ మూవీ స్ట్రీమింగ్ అయ్యే అవకాశాలు వున్నాయని తెలుస్తోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మేర వసూళ్లని రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండియాగా మారిన ఈ మూవీ కోసం ఓటీటీ ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ రెండు సినిమాలు ఒకే సారి నవంబర్ లో స్ట్రీమింగ్ కు రెడీ అవుతుండటంతో ఓటీటీ ప్రేక్షకులు నవంబర్ నెలని బ్లాక్ బస్టర్ మంత్ గా భావిస్తున్నారట. థియేటర్లలో ఈ రెండు సినిమాలని చూడని వారంతా అమెజాన్ ప్రైమ్ లో వీటి కోసం భారీ స్థాయిలో ఎగబడటం ఖాయం అని తెలుస్తోంది. ఇదిలా వుంటే ఈ రెండు సినిమాల స్ట్రీమింగ్ డేట్ లని అమెజాన్ ప్రైమ్ వర్గాలు త్వరలోనే వెల్లడించనున్నాయి.

# తెలుగు తెరపై డబ్బింగ్ ల తాండవం!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో స్ట్రెయిట్ సినిమాలతో పాటు తమిళ సినిమాలు కూడా జోరు చూపిస్తున్నాయి. గత కొంత కాలంగా టాలీవుడ్లో కోలీవుడ్ సినిమాలు తమ ఉనికిని చాటుకుంటూ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాల్ని సొంతం చేసుకుంటున్నాయి. తమిళంతో పాటు తెలుగులోనూ సంచలనాలు సృష్టిస్తున్నాయి. ఈ మధ్య తెలుగులో తమిళ సినిమాలతో పాటు కన్నడ సినిమాలు కూడా అదే జోరుని చూపిస్తున్నాయి. బ్లాక్ బస్టర్ హిట్లు గా నిలుస్తూ ఆశ్చర్యపరుస్తున్నాయి.గత కొంత కాలంగా సైలెంట్ అయిన అనువాద సినిమాల హవా ఇటీవలే టాలీవుడ్ లో మళ్లీ మొదలైంది. తమిళ సినిమాలకు మాత్రమే గత కొంత కాలంగా పరిమితమైన తెలుగు మార్కెట్ లో రీసెంట్ గా కన్నడ సినిమాలు కూడా పాగా వేయడం మొదలైంది. 'కేజీఎఫ్'తో కన్నడ సినిమాలకు తెలుగులోనూ ఆడియన్స్ పెరగడం మొదలైంది. కంటెంట్ ప్రధానంగా సాగే సినిమాలు కన్నడ ఇండస్ట్రీ నుంచి బ్యాక్ టు బ్యాక్ తెలుగులోకి వస్తుండటంతో ఇక్కడి ప్రేక్షకులు వాటికి బ్రహ్మరథం పడుతున్నారు. మరీ ముఖ్యంగా 2022 అనువాద సినిమాలకు అత్యంత అనుకూలంగా మారింది. ఇదే ఏడాది కన్నడ నుంచి విడుదలైన 'కేజీఎఫ్ 2' ఏ స్థాయిలో వసూళ్ల సునామీని సృష్టించిందో అందరికి తెలిసిందే. ఆ తరువాత కూడా రక్షిత్ శెట్టి 'ఛార్లీ 777' కిచ్చా సుదీప్ 'విక్రాంత్ రోణ' మంచి వసూళ్లని సాధించాయి. ఇక రీసెంట్ గా విడుదలైన 'కాంతారా' రికార్డు స్థాయి విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా తెలుగులో ఊహించని విధంగా రూ.25 కోట్ల వరకు వసూళ్లని రాబట్టింది.ఈ మూవీని తెలుగులో గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ పై మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్విడుదల చేశారు. రెండు కోట్ల కు తీసుకున్న ఈ మూవీ రూ.25 కోట్ల వరకు వసూళ్లని రాబట్టి పలువురిని ఆశ్చర్యపరుస్తోంది. దీపావళికి విడుదలైన సినిమాల్లో తమిళ డబ్బింగ్ మూవీ 'సర్దార్' మంచి హిట్ గా నిలిచింది. కార్తి హీరోగా నటించిన ఈ మూవీని పీఎస్ మిత్రన్ తెరకెక్కించారు. స్పై యాక్షన్ థ్రిల్లర్ గా కార్తి కెరీర్ లోనే హయ్యెస్ట్ బడ్జెట్ మూవీగా రూపొందిన 'సర్దార్' తమిళంతో పాటు తెలుగునూ అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. అంతకు ముందు విడుదలైన కమల్ హాసన్ 'విక్రమ్' మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్ 1' తెలుగులో మంచి విజయాన్ని సాధించాయి. 'విక్రమ్' ని తెలుగులో హీరో నితిన్ ఫాదర్ సుధాకర్ రెడ్డి విడుదల చేసి భారీ లాభాల్ని సొంతం చేసుకున్నాడు. ఇక మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్ 1'ని దిల్ రాజు రిలీజ్ చేస్తే తనకు కూడా భారీగానే లాభాల్ని అందించింది. ఓవరాల్ గా ఈ ఏడాది ఇప్పటి వరకు డబ్బింగ్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్ లో తాండవం చేశాయని చెప్పొచ్చు. ఈ సినిమాల ఫలితాలని దృష్టిలో పెట్టుకుని మరిన్ని కన్నడ తమిళ సినిమాలని తెలుగులో డబ్ చేయాలనే పోటీ మరింతగా పెరిగే అవకాశం వుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.




# జింబాబ్వే సంచలనం.. పాక్‌పై పరుగు తేడాతో విజయం



పెర్త్: టి20 ప్రపంచకప్‌లో సంచలనాల పర్వం కొనసాగుతోంది. గత మెగాటోర్నీ సెమీఫైనలిస్ట్ పాకిస్తాన్‌పై జింబాబ్వే సంచలన విజయం సాధించింది. గ్రూప్-2లో గురువారం జరిగిన మ్యాచ్‌లో పరుగు తేడాతో పాక్ ఓడింది.తక్కువ స్కోర్ల మ్యాచ్‌లో... అదికూడా క్రికెట్ కూన జింబాబ్వే చేతిలో ఓటమి పాకిస్తాన్ ముందుకెళ్లే అవకాశాల్ని సంక్లిష్టం చేసింది. బౌలర్లు శ్రమిస్తే ఎదురైన స్వల్ప లక్ష్యాన్ని బ్యాటర్లు నిర్లక్ష్యంగా ఆడి నిరాశను మిగిల్చారు. టాస్ నెగ్గిన జింబాబ్వే మొదట బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది.పాక్ బౌలర్లు వసీమ్ (4/24), షాదాబ్ ఖాన్ (3/23) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. సీన్ విలియమ్స్ (28 బంతుల్లో 31; 3 ఫోర్లు) కాస్త మెరుగనిపించాడు. 131 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 129 పరుగులు చేసింది. పాకిస్తాన్ బ్యాటర్లు రిజ్వాన్ (14), కెప్టెన్ బాబర్ ఆజమ్ (4) చెత్త షాట్లతో నిష్క్రమించారు.షాన్ మసూద్ (38 బంతుల్లో 44; 3 ఫోర్లు) బాగా ఆడినా ... తను కూడా నిర్లక్ష్యంగా స్టంపౌటై వికెట్‌ను పారేసుకున్నాడు. ఆఖర్లో నవాజ్ (18 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) గెలుపుపై ఆశలు పెంచి... కీలకమైన తరుణంలో పేలవమైన షాట్‌తో పెవిలియన్ చేరడం పాక్‌ను గెలవాల్సిన మ్యాచ్‌లో ముంచింది.ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (3/25) పాక్ ఓటమిలో కీలకపాత్ర పోషించాడు. బ్రాడ్ ఇవాన్స్ (2/25), ముజరబాని (1/18), జాంగ్వే (1/10) జింబాబ్వే గెలుపునకు చెమటోడ్చారు. పాక్ 13 ఓవర్ల వరకు 80/3 స్కోరుతో లక్ష్యంవైపే నడిచింది. 14, 16 ఓవర్లు వేసిన రజా పాక్‌ను ఓటమి వైపు మళ్లించాడు. 14వ ఓవర్ వరుస బంతుల్లో షాదాబ్ (17), హైదర్ అలీ (0)లను అవుట్ చేశాడు.30 బంతుల్లో 38 పరుగుల సమీకరణం పాక్‌కు సులువైందే! కానీ మళ్లీ రజా 16వ ఓవర్ వేసి క్రీజులో పాతుకుపోయిన షాన్ మసూద్‌ను స్టంపౌట్ చేశాడు. చివరకు 12 బంతుల్లో 22 పరుగుల సమీకరణం పాక్‌పై ఒత్తిడి పెంచినా... నవాజ్ 19వ ఓవర్లో సిక్సర్ కొట్టి అంతరం తగ్గించాడు. ఆట ఆఖరి మజిలీకి చేరింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**